
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.6, కనిష్ఠం 21.7
నిర్మల్
జిల్లా వార్తలు
8
మంగళవారం 11 మార్చి 2025





• కుంటాల మండలం అర్లి సమీపంలోని శ్రీ ద్వారకమాయి అగ్రో ఇండస్ట్రీస్ ఇదే..



• రైస్‌మిల్‌లో ధాన్యం మిల్లింగ్ చేస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

రూ.48 కోట్ల ధాన్యం స్వాహా!





- జిల్లాలో 16,427 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పక్కదోవ పట్టించిన ఓ రైస్‌మిల్లర్
- 2022 నుంచి ఇప్పటి వరకు ఖరీఫ్, రబీ సీజన్‌లలో ధాన్యం కేటాయింపులు
- రైస్‌మిల్లు యజమానికి రాజకీయ నేతల అండదండలు
- సర్కారు ఆదాయానికి భారీగా గండి కొడుతున్న మిల్లర్లు
- పకడ్బందీగా జిల్లా అడిషనల్ ఎస్పీ రాజేశ్ మీనా దర్యాప్తు
- కోట్ల రూపాయల విలువైన ధాన్యం పక్కదోవ పట్టినట్లు నిర్ధారణ
- మిల్లు యజమానిపై ఎఫెన్షియల్ కమోడిటీ యాక్ట్ కింద కేసు నమోదు

నిర్మల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2022 ఖరీఫ్ సీజన్ నుంచి మొదలుకొని ఇప్పటి వరకు కోట్ల రూపాయల విలువైన ధాన్యం పక్కదోవ పట్టినా బాధ్యులపై చర్యలు కరువవుతున్నాయి. ఒక్కో రైస్‌మిల్లు కోట్ల రూపాయల్లో ధాన్యాన్ని స్వాహా చేసినా పట్టింపు లేకుండా పోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి ఈ అక్రమ దందా కొనసాగుతోంది. రైస్ మిల్లర్లు తమకున్న రాజకీయ అండదండలతోనే దర్జాగా ఈ అక్రమ దందాను కొనసాగిస్తూ కోట్ల రూపాయల సర్కారు ధనానికి గండి కొడుతున్నాయి. ఇదే కోవలోజిల్లాలోని కుంటాల మండలం అర్లి సమీపంలో గల శ్రీద్వారకమాయి అగ్రో ఇండస్ట్రీస్ దాదాపు రూ.48కోట్ల విలువైన ధాన్యాన్ని పక్కదోవ పట్టించినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. ఈ రైస్‌మిల్లు నుంచి 16,427 మెట్రిక్ టన్నుల ధాన్యం పక్కదోవ పట్టినట్లు పోలీసు అధికారుల విచారణలో నిర్ధారించారు. పదిహేను రైస్‌మిల్లులపై ధాన్యం అక్రమాలకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. ఈ కేసులపై అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా సీరియస్‌గా దర్యాప్తు చేస్తున్నారు. కుంటాల మండలం అర్లిలోని ద్వారకమాయి అగ్రో ఇండస్ట్రీస్ పెద్ద మొత్తంలో ధాన్యాన్ని పక్కదోవ పట్టించినట్లు వెల్లడైంది. దీంతో పోలీసులు, పౌర సరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా సంబంధిత అగ్రోస్ ఇండస్ట్రీస్ యజమాని రుక్మిణిని ఏ-1గా అసలు సూత్రధారి ఆమె భర్త వెంకటేశ్‌పై ఏ-2గా ఈసీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అయితే వీరిద్దరినీ కేసులో నుంచి కాపాడేందుకు ముథోల్ నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ మాజీ ఎమ్మెల్యే పెద్ద ఎత్తున ప్రయత్నాలు సాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మొదటి నుంచి సదరు రైస్ మిల్లు యజమానికి రాజకీయ అండదండలు భారీగా ఉన్న కారణంగానే ఆయనపై చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులు వెనకడుగు వేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో నిర్మల్ అడిషనల్ ఎస్పీ రాజేశ్ మీనా రాజకీయ ఒత్తిళ్లను పక్కన పెట్టి పకడ్బందీగా దర్యాప్తు జరిపారు. ఈ దర్యాప్తులో కోట్ల రూపాయల విలువైన ధాన్యం పక్కదోవ పట్టినట్లు నిర్ధారణ కావడంతో మిల్లు యజమానులపై ఈసీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడం జిల్లా వ్యాప్తంగా దుమారం రేపుతోంది.

అవకతవకలతో సంబంధం లేకుండా కేటాయింపులు..

ద్వారకమాయి అగ్రో ఇండస్ట్రీస్‌పై అనేక ఆరోపణలు ఉన్నప్పటికీ.. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోలేదు. 2022 సంవత్సరం నుంచి అగ్రో ఇండస్ట్రీస్ యాజమాన్యం అవకతవకలకు పాల్పడుతున్నప్పటికీ వాటిని పరిగణలోకి తీసుకోకుండా 2022-2023 రబీలో 9040.160 మెట్రిక్ టన్నులు, 2023-2024 ఖరీఫ్‌లో 2309.96 మెట్రిక్ టన్నులు, 2023-2024 రబీలో 4996 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం ద్వారకమాయి అగ్రో ఇండస్ట్రీస్‌కు కేటాయించారు. ఇలా కేటాయించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఇవ్వకుండా సదరు ఇండస్ట్రీస్ యాజమాన్యం మొత్తం పక్కదోవ పట్టించి స్వాహా చేసింది. అధికారుల పర్యవేక్షణ లోపం పరోక్ష అండదండలతోనే ఈ తతంగం సాగినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

15 రైస్‌మిల్లులపై చర్యలేవీ..!?

జిల్లాలో ఇప్పటి వరకు 15 రైస్‌మిల్లుల యాజమాన్యాలు అవకతవకలకు పాల్పడినట్లు నిర్ధారణ అయినప్పటికీ ఆ మిల్లులపై నామమాత్రపు కేసులు నమోదు చేశారే తప్ప.. కఠిన చర్యలు తీసుకోకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 15 రైస్‌మిల్లుల్లో 48,500 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు అధికారులే స్వయంగా నిర్ధారించారు. అధికారులు నామమాత్రపు కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. మొత్తం 48,500 మెట్రిక్ టన్నుల ధాన్యం విలువ పెనాల్టీతో కలిపి రూ.53 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

రాజకీయ అండదండలతోనే..

అక్రమాలకు పాల్పడుతున్న పలు రైస్‌మిల్లు యాజమాన్యాలకు మొదటి నుంచి పెద్ద ఎత్తున రాజకీయ అండదండలున్నట్లు ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పలువురు రైస్‌మిల్లు యాజమాన్యాలు అధికారుల హెచ్చరికలను సైతం విస్మరిస్తూ యథేచ్ఛగా అక్రమాలను కొనసాగించారన్న ఆరోపణలున్నాయి. తనిఖీలకు వచ్చే అధికారులను సైతం వీరు తమ రాజకీయ అండదండలతో ప్రభావితం చేసి కేసులు నమోదు కాకుండా చేసుకోగలిగారంటున్నారు. కొంతమంది అధికారులు వీరిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనప్పటికీ.. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వెనకడుగు వేయాల్సి వచ్చిందంటున్నారు. రైస్‌మిల్లుల్లో తనిఖీలకు వచ్చే అధికారులకు కనికట్టు లాంటి లెక్కలు చూపి గందరగోళాన్ని సృష్టించారన్న ఆరోపణలున్నాయి. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎంఆర్ ధాన్యం కేటాయింపులపై పూర్తిస్థాయి విచారణ జరిపింది. దీంతో 15 రైస్‌మిల్లులపై కేసులు నమోదు చేయగా ఓ రైస్‌మిల్లుపై ఈసీ యాక్ట్ కింద కేసు నమోదు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

పోలీసులు అందుబాటులో ఉండాలి

• ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ జానకీషర్మిల అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. స్పందించి ఎస్సైలతో మాట్లాడి చట్ట పరిధిలో పరిష్కరించాలన్నారు. భూములకు సంబంధించిన సమస్యలు కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచవద్దని, తక్షణం పరిష్కరించాలని సూచించారు. శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలని కోరారు. అసాంఘికశక్తుల సమాచారం అందించాలన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ఎమ్మెల్యేలు



విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యేలు

నర్సాపూర్(జి), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం)లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌లు ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు పాఠశాలలోని సౌకర్యాలు, ఇబ్బందులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఎదగాలని సూచిస్తూ, ఎటువంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణను మొత్తం సందర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ గౌడ్, మండల అధ్యక్షులు నరేందర్, నాయకులు సవీన్, దత్తురాం, సుధాకర్, శ్రీకాంత్ రెడ్డి, రాజేందర్ ఉన్నారు.

పంటలకు సాగునీరు అందించాలి

• వీడియోకాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : యాసంగి పంటలకు సాగునీటిని సమర్థవంతంగా అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి యాసంగి పంటలకు సాగునీటి సరఫరాపై వ్యవసాయ, నీటి పారుదల శాఖ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి సీఎస్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ... వేసవిలో పంటలకు సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. నీటి వనరులను సమర్థంగా వినియోగించేందుకు ప్రత్యేకదృష్టి పెట్టాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని సమయానికి అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ ఎస్ఈ రవీందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారుల డుమ్మా

భైంసా, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలతో నిలిచిపోయిన ప్రజావాణి తిరిగి సోమవారం పునఃప్రారంభమైంది. ఎన్నికల కోడ్ కారణంగా నెలరోజులకు పైగా ప్రజావాణి నిర్వహణ జరుగలేదు. సోమవారం నుంచి ప్రజావాణి ప్రారంభిస్తున్నట్లుగా కలెక్టర్ ప్రకటించారు. అయితే భైంసాలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి అధిక శాతం అధికారులు డుమ్మా కొట్టారు. 15కుపైగా ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజావాణికి హాజరుకావాల్సి ఉండగా కేవలం మూడుశాఖలకు చెందిన అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగతా ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు ప్రజావాణికి రాలేదు.

మహిళలు క్రీడల్లో రాణించాలి

• జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలు క్రీడాపోటీల్లో పాల్గొని రాణించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకాంక్షించారు. సోమవారం కొండాపూర్ సమీపంలోని నిర్మల్‌స్పోర్ట్స్ అకాడమీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ప్రత్యేకంగా క్రీడాపోటీలు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా పోటీలు ప్రారంభించి వారితో కలెక్టర్ చెస్, క్యారం, టెన్నిస్ తదితర ఆటలు ఆడి ఉత్తేజపరిచారు. ఆర్డీవో రత్న కళ్యాణి, క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

పెండింగ్‌లో పెట్టవద్దు...

ప్రజావాణిలో ప్రజల సమస్యలు విన్న విన్నూ వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టవద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పలు ప్రాంతాల ప్రజల సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. స్థానికసంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి పాల్గొన్నారు.

మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. సోమవారం మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరాన్ని వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహించింది. కలెక్టర్‌తో పాటు పలువురు మహిళా అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు.

బాలశక్తి కార్యక్రమం అమలు కోసం హైదరాబాద్ స్మార్ట్ విజన్ కంటి ఆసుపత్రి వైద్యుడు జి. హర్షవర్ధన్ రెడ్డి అందించిన వాహనాన్ని సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రారంభించారు. డీఈవో రామారావు, వైద్యాధికారి రాజేందర్, డీఆర్డీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

పట్టణంలో అక్రమాలకు గురైన కందకాలను పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ వినతి పత్రం ఇచ్చారు.

గత 78 రోజులుగా రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్నా పట్టించుకోని తీరుకు నిరసనగా సోమవారం జాదవ్‌మోతిరాం అనే రైతు కుటుంబ సభ్యులతో కలెక్టర్‌ను కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి ఈ నెల 20వ తేదీన గ్రామానికి వచ్చి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తిరుపతి పాల్గొన్నారు.



వాహనం ప్రారంభిస్తున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో గల మహిళా శక్తి క్యాంటీన్‌లో జిల్లా అధికారులకు పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కాఫీ, మ్యాగీ చేయడం వంటి పోటీలు నిర్వహించగా డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ రుచికరమైన టీచేసి కలెక్టర్, డీఆర్డీవోకు అందించారు. టీ సేవించిన అధికారులు డీఎంహెచ్‌వోను ప్రశంసించారు.



కలెక్టర్‌కు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఐకేపీ సీఏపై చర్యలు తీసుకోవాలి..

దిలావర్‌పూర్ : స్త్రీనిధి డబ్బులను దుర్వినియోగం చేసిన ఐకేపీ సీఏపై చర్యలు తీసుకుని తమకు న్యాయంచేయాలని దిలావర్‌పూర్ మండలం కంజర్ మహిళలు సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు చేశారు. కంజర్ గ్రామానికి చెందిన ఐకేపీ సీఏ ముత్యం మహిళలు నెలనెల చెల్లించే వాయిదాలను బ్యాంకులో చెల్లించకుండా సొంతానికి వాడుకుని దుర్వినియోగం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఏపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల తనిఖీ



తనిఖీకి వచ్చిన డీఐఈవో

భైంసా, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని ఇంటర్ పరీక్షా కేంద్రాలను సోమవారం అధికారులు తనిఖీ చేశారు. డీఐఈవో పరుశురామ్ నేతృత్వంలో డెక్ బృందం, ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలోని పోలీసు అధికారుల బృందం పట్టణ పరిధిలోని మూడుపరీక్షా కేంద్రాలలో వేర్వేరుగా తనిఖీలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల్లోని గదులకు వెళ్లి పరిశీలనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్పీ అవినాష్‌కుమార్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లుగా వెల్లడించారు. ఇక డీఐఈవో పరుశురామ్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా, సమస్యలు తలెత్తకుండా పరీక్షలను నిర్వహించాలని ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు సూచించారు.

ముథోల్ : మండల కేంద్ర మైన ముథోల్‌లోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను సోమవారం భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ పరిశీలించారు. ముథోల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రం, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పరీక్షాకేంద్రాన్ని సందర్శించి సంబంధిత అధికారులకు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఎస్పీ వెంట ముథోల్ ఎస్సై సంజీవ్, తదితరులున్నారు.

రైతులతో చెలగాటమాడుతున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

• మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఆగ్రహం



రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మాజీ మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అడ్డుకుంటూ రైతుల జీవితాలతో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చెలగాటమాడుతున్నారని మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఆరోపించారు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణవిషయంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ సోమవారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయం వద్ద మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి రైతులతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా.. అలాగే తాను ఓ రైతుగా ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం పోరాడుతున్నట్లు తెలిపారు. రైతుల కోసం తాను చేపట్టిన ఈ పోరాటం ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగే వరకూ కొనసాగుతుందన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలోనే రైతుల నుంచి 6 కోట్ల రూపాయలు వెచ్చించి 40 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఫ్యాక్టరీ నిర్మాణానికి అన్ని రకాల అనుమతులు వచ్చినప్పటికీ.. ఇరి గేషన్ శాఖ నుంచి బఫర్ జోన్‌కు సంబంధించిన అనుమతులు రాకుండా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అడ్డుకుంటున్నారన్నారు. వ్యవసాయం గురించి మహేశ్వర్ రెడ్డికి ఎలాంటి అవగాహన లేదని, తనకు రైతుగా వ్యవసాయం ఎంత కష్టతరమన్న విషయం తెలుసన్నారు. ప్రస్తుతం నిర్మల్ సెగ్మెంట్‌లో 4000ల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట దిగుబడులు రాబోతున్నాయన్నారు. నిర్మల్‌లో ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే సిరిసిల్ల, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల రైతులు పంటను అమ్ముకునే అవకాశం ఉంటుందన్నారు. మహేశ్వర్ రెడ్డిని రైతులంతా నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ధర్నా అనంతరం ఆర్డీవో రత్నకళ్యాణికి, కలెక్టరే ట్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఇంద్రకరణ్ రెడ్డి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు ఓస రాజేశ్వర్, అర్గుమీది రామయ్య, ఎఫ్ ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, ఎస్సీ సెల్ నాయకుడు సత్యనారాయణ, బన్సపెల్లి పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి, దేవరకోట ఆలయ మాజీ చైర్మన్ లడ్డు సేట్, మాజీ డీసీఎం చైర్మన్ నారాయణరెడ్డి, అప్పాల మహేష్, పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, అనుముల భాస్కర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ

జైనథ్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని ఆకోలి గ్రామంలో నూతనంగా నిర్మించి శ్రీరామాలయంలో సోమవారం సీతా రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పూలతో పాటు విద్యుత్ బల్బులతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుమందు సీతా రాముడి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, ఇతర ఆభరణాలను ధరింప చేసి భాజా భజంత్రీల మధ్య పల్లకీలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సీతారామ కల్యాణోత్స వాన్ని నిర్వహించారు. ఇందులో ఆదిలాబాద్ గోపాలకృష్ణ మఠం పీఠాధి పతి యోగానంద సరస్వతి, ప్రధాన అర్చకుడు దుబేవైభవ్, మెగారాజ్‌శర్మ, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక లింగాష్టక పారాయణం

బోథ్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోనాల గ్రామంలో ఉన్న రాజరాజేశ్వర ఆలయంలో ప్రతీ సోమవారం ఉదయం పూట సామూహిక లింగాష్టక పారాయణాన్ని నిర్వహిస్తున్నారు. 21 వారాల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. భక్తులకు చివరి రోజున అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, దాతలు ముందుకు వచ్చినట్లయితే కార్యక్రమాన్ని మరింతగా విజయవంతం చేస్తామని వారు తెలిపారు.

క్రీడలతోనే మానసికోల్లాసం : పతంగే

గుడిహత్నూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే శారీరకంగా మాన సికంగా ఉల్లాసం కలుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మా నంద్ అన్నారు. సోమవారం మండలంలోని కొల్హారీ లో క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ప్రతీఒక్కరు క్రీడ ల్లో చురుకుగా పాల్గొనాలని తద్వారా శారీరకంగా దృఢంగా ఉంటారన్నా రు. అనంతరం గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు.

నేడు ప్రజావాణి కార్యక్రమం : ఎంపీడీవో

భీంపూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో నెలకు ఒకసారి ఫిర్యాదులకు సంబంధించిన ప్రీసైడింగ్ అధికారి ఆధ్వర్యంలో బహిరంగ విచారణ నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

రసవత్తరంగా సాగిన వీడీసీ ఎన్నికలు

బోథ్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బోథ్ గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నికలు రసవత్తరంగా కొనసాగాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా సీక్రెట్ బ్యాలె ట్ ఓటింగ్ నిర్వహించారు. అధ్యక్ష పదవికి అల్లకొండ పోతన్నతో పాటు భూస రాము, చంద్‌లు పోటీపడ్డారు. అయితే పోటీలో 37 ఓట్లు సాధించి అల్లకొండ పోతన్న అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. భూస రాముకు 35 ఒక ఓట్లు వచ్చాయి. దీంతో మెజారిటీ సాధించిన పోతన్న అధ్యక్షుడిగా గెలు పొందినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

'బీజేపీ నేతలపై చర్యలు తీసుకోండి'

ఆదిలాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల క్రితం ఆది లాబాద్ మున్సిపాలిటీలో నిర్వహించిన అధికారుల సమీక్ష సమావేశంలో కొందరు బీజేపీ నేతలు పాల్గొనడం సరైంది కాదంటూ కాంగ్రెస్ నేతలు క లెక్టర్ రాజార్షిషాకు ఫిర్యాదు చేశారు. వారిలో జహీర్‌రంజాని, కలాలశ్రీని వాస్, చందనర్సింగ్, బి.సతీష్, లక్ష్మణ్, రాంకుమార్, తదితరులున్నారు.

దేశీదారు విక్రయించిన మహిళకు జరిమానా

ఆదిలాబాద్ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): భీంపూర్ మండలంలోని బెల్సరి రాంపూర్‌కు చెందిన సురేఖ అనే మహిళ దేశీదారు విక్రయించడం తో గతంలో ఆమెను బైండోవర్ చేశారు. సదరు మహిళ మళ్లీ దేశీదారు విక్రయిస్తూ పట్టుబడడంతో ఆమెకు తహసీల్దార్ రూ.లక్ష జరిమానా విధిం చారు. సదరు ఆదేశాల మేరకు సురేఖతో రూ.లక్ష చలాన్ ద్వారా ప్రభుత్వా నికి సోమవారం జమ చేసినట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు.

విద్యార్థిని అనుమానాస్పద మృతి

● ఇచ్చోడ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఘటన ● ఆదిలాబాద్ జిల్లాలో పలుచోట్ల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు



రోదిస్తున్న బాలిక కుటుంబ సభ్యులు



ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



చిక్రం లాలిత్య(ఫైల్)

ఇచ్చోడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బాగా చదువుకొని బంగారు భవిష్యత్తు నిర్మించుకుందామనికి ఆశ్రమ పాఠశాలలో చేరిన ఓ ఆదివాసీ విద్యార్థిని జీవితం అర్థాంతరంగా ముగిసింది. అప్పటివరకు తోటి పిల్లలతో ఆడిపాడి భోజనం చేసి నిద్ర పోయిన చిన్నారి నిద్రలోంచి తిరిగిరాలేదు. ఎన్నో ఆశలతో వసతిగృహంలో ఉండి తోటి స్నేహితులతో కలిసి భోజనం చేసి వారితో పాటే పడుకుంది. పోలీసులు, స్నేహితుల వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్ మండలంలోని మోర్కం డి గ్రామానికి చెందిన లాలిత్య(14) ఇచ్చోడ మండల కేంద్రం లోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. నిత్యం లాగానే ఆదివారం రాత్రి తోటి విద్యార్థుల తో కలిసి భోజనం చేసింది. అందరితో కలివిడిగా ఉన్న బాలిక వారితో కలిసి నిద్రించింది. సోమవారం ఉదయం 7గంటల వరకు నిద్ర లేవకపోవడంతో విషయం స్థానిక ఉపాధ్యాయులకు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు వచ్చి చూసేసరికి ఎలాంటి స్పర్శ లేకపోవడంతో వెంటనే పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ భీమేష్ బాలిక పరిస్థితిని పరిశీలించారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. మృతదేహాన్ని ప్రైవేటు వాహనంలో పోస్టుమార్టం నిమి త్తం బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

● ప్రభుత్వ హాస్టళ్లపై నమ్మకం పోయింది : బోథ్ ఎమ్మెల్యే

బోథ్: బోథ్ నియోజకవర్గంలో ప్రభుత్వ హాస్టళ్లలో పరిస్థితి దయనీ యంగా మారిందని, విద్యార్థులకు హాస్టళ్లపైన నమ్మకం పోయిందని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ విమర్శించారు. సోమవారం బోథ్ ఆసుపత్రిలో బాలిక మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడే విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్టళ్లపైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు నమ్మకం లేకుండా పోయిందన్నారు. హాస్టళ్లలో కనీస వసతులు లేవని, నీటి కొరత, మరుగుదొడ్లు, భోజన వసతి అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఇరుకు గదు లలో విద్యార్థులు ఉండడంతో పాటు వాటిలో సమస్యల మధ్య చదువులు కొనసాగుతున్నాయన్నారు. ఆ తర్వాత బాలిక మృతియకి గల కారణాలను సీఐలు భీమేష్, వెంకటేశ్వరరావులను అడిగి తెలుసుకున్నారు. తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా ముందు ముందు ఉద్యమం చేస్తామన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

● 'బాలిక కుటుంబానికి న్యాయం చేయండి'

బోథ్: ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలిక లాలిత్య మృతి చెందింది అయితే ఆమె శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని సోమవారం ఉద యం బోథ్ సివిల్ ఆసుపత్రికి తీసుకురావడం జరిగింది. అయితే విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల వారు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. బాలిక కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ అధికారులు పాఠశాలలను పట్టించుకోవడంలేదని వారు విమర్శించారు. ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ నిర్లక్ష్యంగా మాట్లాడడం సరైనది కాదన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా మాట్లాడితే హాస్టల్లో పైన విద్యార్థులకు నమ్మకం పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు ముస్సిఫ్ డీఎస్పీ నాయకులు వెంకటేష్, సీసీఐ పట్టణ అధ్యక్షుడు నరేల, తదితరులున్నారు.

● పీవో క్యాంపు కార్యాలయం ముందు దర్నా

ఉట్నూర్: ఇచ్చోడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలిక అనుమానాస్పద మృతి చెందిందని, ఈ వ్యవహారంతో అధికారులు ఎవరూ కూడా ఇప్పటి వరకు స్పందించడం లేదని, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని, వెంటనే హాస్టల్ వార్డెన్‌ను, ఏటీడీవోను వెంటనే సస్పెండ్ చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్ డిమాండ్ చేశారు.

● 'ఉన్నతాధికారులతో విచారణ జరిపించాలి'

ఆదిలాబాద్ రూరల్: ఇచ్చోడ బాలిక ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థిని మృతి పట్ల ఉన్నతాధికారులతో విచారణ జరిపించాలని పీడీఎస్ యూ, ఏవీఎస్‌పీ డిమాండ్ చేశాయి. సోమవారం పట్టణంలోని కొమురం భీరం భవన్‌లో నాయకులు సాయి, నర్సింగ్ మాట్లాడుతూ ఇచ్చోడ గిరిజన విద్యార్థులు పాఠశాలలో 9వ తరగతి బాలిక అనుమానాస్పద మృతి చెందడం పట్ల ఇప్పటికీ అధికారులు స్పందన లేదన్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

● 'ఆదివాసీ గిరిజన విద్యార్థులపై చిన్నచూపు'

నేరడిగొండ: ఆదివాసీ గిరిజన విద్యార్థులను చిన్నచూపు చూస్తే ఊరు కోమని లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. సోమవారం మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ గురుకుల పాఠశాలలో చదువుకునే గిరిజన విద్యార్థులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం ఖండించకపోవడం సిగ్గు చేటని లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని చిక్రమ్ లాలిత్య అనుమానాస్పదంగా మృతి చెందిందని, మృతికి గల కారణాలు వెంటనే తెలుకుని బాధితులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా మాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాలకు.. అడ్డా!

(5వ పేజీ తరువాయి...)

ప్రమాదాలకు కారణమవుతున్నాయి. జాతీయ రహదారి నిర్మాణంలో ఎన్నో సాంకేతిక లోపాలు కనిపిస్తున్నా.. దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదంటున్నారు.

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా?

జిల్లాలో నిత్యం ఎక్కడో ఒకచోట రహదారిపై ప్రమాదాలు చోటు చేసు కుంటున్నా.. పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. రోజుల తర బడి మరమ్మతు పనులను చేపట్టడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్ప డం లేదు. అలాగే రోడ్డు నిర్మాణ సంస్థల పెట్రోలింగ్ పత్తా లేకుండానే పో యింది. ఎక్కడైనా ప్రమాదం జరిగినా.. వాహనాలు మరమ్మతులతో రోడ్డు పై నిలిపిన క్షణాల్లో తొలగించి ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ రోజుల తరబడి నిలిపి ఉంచిన వాహనాలను తొలగించే ప్రయత్నం కూడా చేయడం లేదు. అలాగే ఆపద సమయంలో అంబులెన్స్‌కు సమాచారం అందించేందుకు కూడా రహదారి పై వసతులు కనిపించడం లేదు. నాం కే వాస్తేగా పెట్రోలింగ్ చేస్తూ ఎక్క డో ఒకచోట వాహనాన్ని నిలిపి కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు వస్తు న్నాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే నిలిపి ఉంచిన వాహనాలతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా యి. కొన్ని గ్రామాల సమీపంలో అండర్ పాసింగ్‌లు లేకపోవడంతో ప్రమాదకరంగా రోడ్డును దాటుతున్న క్రమంలో ప్రాణాలు పోతున్నాయి. రోడ్డు పైనే యథేచ్ఛగా పశు వులు, జంతువుల సంచారం కూడా కనిపిస్తోంది. రహదారికి ఇరువైపుల ముళ్లకంచెను ఏర్పాటు చేసినా.. పూర్తిగా ధ్వంసమైపోయి అసలు భద్రత లేకుండానే పోయిందంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నేరడిగొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరిగాం బస్టాండ్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్ర మాదంలో యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన బొడిగే గణేష్ అలియాస్ ఆదర్శ(26) ఆదివారం రాత్రి నిర్మల్‌లో ఉంటున్న ఆయన భార్య వద్దకు బైక్‌పై వెళుతుండగా గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై సంఘటన స్థలం లోనే మృతి చెందాడు. మృతదేహాన్ని బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్ప గించారు. మృతుడి భార్య కోసం వెళుతూ ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబీకులు కన్నీటి పర్యవంతమయ్యారు.

● అనుమానాస్పదంగా మరో యువకుడు ..

మావల: అనుమానస్పదంగా ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మావల ఎస్సై గౌతమ్ తెలిపిన వివరా ల ప్రకారం.. మావల మండల కేంద్రానికి షేక్ ఫర్వేజ్(22) పెట్రోల్ బంక్‌లో పని చేస్తుంటాడు. కాగా ఆదివారం ఉదయం 11 గంటలకు బయటకు వెళ్లి వస్తాను అని చెప్పి ఇంటి నుంచి బయలు దేరాడు. అయితే రాత్రి అయిన ఇం టికి రాకపోవడంతో తెలిసిన వారి దగ్గర ఆరా తీశారు. మావల సమీపంలోని ఎర్రకుంట చెరువు దగ్గర సోమవారం శవమై తేలాడు. గమనించిన స్థానికులు, పోలీసులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కానీ కుటుంబ సభ్యులు ఫర్వేజ్ మృతిపై అనుమానాలు ఉన్నాయ ని, మృతుడి తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'పాత రికార్డు ప్రకారమే పూర్తి చేయాలి'

బోథ్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బోథ్ బస్టాండ్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడను పాత రికార్డు మ్యాప్ ప్రకారమే ఆర్టీసీ అధికారులు నిర్మించి పూర్తి చేయాలని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి కోరారు. సోమవారం మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం అనంతరం ఆయన మా ట్లాడారు. ప్రభుత్వం ప్రయాణికుల అవసరాల కోసం బస్టాండ్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తుందని, అయితే కొంతమంది వ్యక్తులు ఆర్టీసీ స్థలాన్ని ఆక్రమించు కునేందుకు ప్రహరీ గోడను తమ ఇళ్ల ముందు వరకు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కార్మికుల ఇళ్లకు కరెంటు పునరుద్ధరణ

నిర్మల్‌రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సాయి బాబా ఆలయంలో నివాసగృహాలకు కరెంట్ పునరుద్ధరించారు. కార్మి కులు ఇబ్బంది పడుతున్నారనే కథనంపై ఆలయ చైర్మన్ తక్షణమే స్పందించి కరెంట్‌ను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా కార్మికులు ఆలయ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాలశక్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

సోన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా యంత్రాంగం ప్రతిష్టా త్మ కంగా చేపట్టిన బాలశక్తి కార్యక్రమంలో భాగంగా సోన్ మండలంలోని పాక్‌పట్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్‌పోటీని నిర్వ హించా రు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్య, ఆర్థిక, సామాజిక సామ ర్థ్యాలు, నైపుణ్యాలు పెంపొందించేందుకు ఆర్థిక అక్షరాస్యత అనే అం శంపై విడ్స్ స్వచ్ఛంద సంస్థ క్విజ్‌ను నిర్వహించింది. మొత్తం ఐదు జట్లు పాల్గొనగా ప్రథమ బహుమతి డి. అభిరామ్ గ్రూప్, ద్వితీయ బహుమతి కే. వశేఖర్ గ్రూప్ విజేతలుగా నిలిచారు. ఉపాధ్యాయులు తోడిశెట్టి రవికాంత్, సంస్థ కౌన్సిలర్ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన ఏఈవో

ముథోల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విట్టోలి, గన్నో రా, రువ్వి గ్రామాల్లో వరి పొలాలను సోమవారం ఏఈవో రుషికేష్ పరి శీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో (పొద్దున అధిక చలి, పగ టిపూట అధిక ఉష్ణోగ్రత పరిస్థితులు) వరి పంటలో అగ్గి తెగుళ్ల వ్యాప్తి గమనించామన్నారు. దీని వలన పొలం ఎండిపోయి దూరం నుంచి చూస్తే పొలం తగలబడినట్లు కనిపిస్తుందన్నారు కాబట్టి దీని వలన దిగుబడి తగ్గిపోతుందన్నారు. దీని నివారణకు ట్రై సైక్లోజోల్ ఎకరాకు 120 గ్రాములు, ట్రై సైక్లోజోల్, పికాక్సిస్ట్రోబిన్ ఎరాకు 400ల ఎంఎల్ కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు.

ఘనంగా బోనాల సమర్పణ

కుబీర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రేణుక ఎ ల్లమ్మ ఆలయంలో సోమవారం గీత పారిశ్రామిక సహకార సంఘం, ఆలయ కమిటీ నాయకులు మహిళలు అమ్మవారికి బోనాలను స మర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజామున దేవతా మూర్తులకు అభిషేకం, అర్చన, హారతి కార్యక్రమాలు చేపట్టారు. మహి ళలు మంగళహారతులతో డప్పులు దరువులు, శివసత్తుల విన్యాసాల తో ప్రధాన వీధుల గుండా శోభయాత్ర నిర్వహిస్తూ ఎల్లమ్మ ఆలయా నికి చేరుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్ర మంలో గౌడ సంఘ నాయకులు చేపూరి కనకాగౌడ్, రామస్వామిగౌడ్, కిష్టాగౌడ్, రతన్, అర్జున్, అరుణ్, మహిళలు, తదితరులున్నారు.

'అనాథ బాలుర అభ్యున్నతికి బాటలు'

భైంసా, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తల్లి,తండ్రులను కోల్పోయి ఆధా రం లేకుండా పోయిన బాలురను తమ ఆవాసంలో చేర్చుకొని వారి అభ్యున్నతికి బాటలు వేస్తున్నామని భైంసా శ్రీ వివేకానంద ఆవాసం అధ్యక్షులు శైలేష్ మహాశెట్టివార్ పేర్కొన్నారు. సోమవారం ఆవాసంలో తానూర్ మండలంలోని ఎల్వి గ్రామానికి చెందిన బాలుడొకరు ఆవా సంలో చేరిన సందర్భంగా మాట్లాడారు. అనాథ బాలలకు వాసంలో చేర్చుకొని ఉచిత వసతి,విద్యను అందించి ప్రయోజకులుగా తీర్చిది ద్దుతున్నామని తెలిపారు. ఆవాసం నిర్వాహక ప్రతినిధి లింగారెడ్డి, ఎ ల్వి గ్రామ మాజీ సర్పంచ్ పోతారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే మహిళలకు ఆదర్శనీయం

నిర్మల్ కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు సావిత్రి బాయి పూలే ఆదర్శనీయమని బీసీ సంక్షేమ సంఘ నేతలు అన్నారు. సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ ఆమె చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే భర్త మహా త్మా జ్యోతిబాపూలే సహకారంతో మహిళలను అక్షరాస్యులుగా చేసి వారి అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని కొనియాడారు.

మంచినీరు అందించేందుకే అమృత్ పథకం

● ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ● 62.5 కోట్లతో శంకుస్థాపన



అమృత్ పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఏలేటి

నిర్మల్‌కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు సురక్షిత మంచినీరు అందించే లక్ష్యంగా అమృ త్‌పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని ఎమ్మె ల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం రూ.62.5 కోట్లతో అమృత్ పథకానికి జిల్లా కేంద్రంలో శంకు స్థాపన చేశారు. ఈ సంద ర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా కేంద్రం ఈ పథకం ద్వారా అభివృద్ధి పనులు చేపడుతోం దన్నారు. బీజేపీ అభ్యర్థిగా తనను ప్రజలు గెలిపించగానే కేంద్ర ప్రభు త్వం నుంచి పట్టణంలో ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటుకు 42 కోట్లరూపాయలు మంజూరు చేయించానని తెలిపారు. నిర్మల్ అభివృద్ధికి తనవంతు కృషి ఉంటుందన్నారు. నాయకులు నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రావుల రాంనాథ్, సత్యనారాయణ గౌడ్, మేడిసెమ్మె రాజు, ఆకుల కార్తీక్, సుంకరి సాయి, సాధం అరవింద్, నవీన్, నరేందర్, శంకరపతి పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్మల్ పట్టణం, రూరల్ మండలానికిచెందిన 280 మంది లబ్ధిదారులు చెక్కులు అందుకున్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రంలో గల తహసీ ల్దార్ కార్యాలయం ఎదుట బీజేఎల్పీనేత ఏలేటి మహే శ్వర్ రెడ్డి మోడల్ హౌస్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసి అలాగే ధనిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేసి గ్రామస్థులకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి పనులను వివరించారు. ఈయన వెంట రాంశంకర్ రెడ్డి, నరేష్, చంద్రప్రకాష్ గౌడ్, బడి పోతన్న, సాహెబ్ రావు, రాజు, వీరయ్య ఉన్నారు.

దిలావర్‌పూర్ : నిర్మల్ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేయడంతో పాటు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. గ్రామంలో నిర్మించ తలపెట్టిన శ్రీ మార్కండేయ స్వామి ఆలయం, ముదిరాజ్ సంఘం, గురిడే కాపు సఘం, ఏక్‌నాథ్ ఆలయం, వీర హనుమాన్ ఆలయం, గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ గౌడ్, మాజీ జడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, ముత్యం రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ జంగం వీరేష్, శైలేశ్వర్, చంద్రకాంత్, బీజేపీ మండల అధ్యక్షులు నర్సారెడ్డి పాల్గొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు విద్యుత్ సరఫరా చేయాలని అందులో నివసిస్తున్న గ్రామస్థులు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిని కోరారు. దీంతో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఫోన్‌లో విద్యుత్ శాఖ డీఈతో మాట్లాడారు. విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు.

ఘనంగా రాజగోపురం ప్రతిష్ఠాపన మహోత్సవం

మామడ : మండలంలోని పొన్కల్ శ్రీ లక్ష్మీ వెంక టేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం రాజగోపురం ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మహోత్సవంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అలాగే డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు దర్శిం చుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు రామచంద్ర చార్యులు, విజయ సారథి, కన్నయ్య, ఆలయ, వీడీసీ కమిటీ చైర్మన్లు రవీందర్ రెడ్డి, సభ్యులు, నాయకులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

నర్సాపూర్ (జీ): నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండ లానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు 24 కళ్యాణ లక్ష్మి, 7 షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్‌లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ గౌడ్, మండల అధ్యక్షులు బర్కుంట నరేందర్, నాయకులు నవీన్, దత్తురాం, సుధాకర్, శ్రీకాంత్ రెడ్డి, రాజేందర్, రాజు, గంగారాంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుతోనే పసుపు దిగుబడి అధికం

● జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి



మాట్లాడుతున్న పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి

మామడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ వ్యవ సాయంతోనే పసుపు దిగుబడి అధికంగా వస్తుందని జాతీయ పసుపు ఉత్పత్తి చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొరటికల్ పసుపు రైతు ఉత్పత్తిదారుల సమా వేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. పసుపు కోత అనంతరం చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు, మేలైన యాజమా న్యం, సుస్థిర దిగుబడి, పసుపు జాతీయ బోర్డు ముఖ్య కార్య క్రమాలు చేపట్టబోయే ప్రణాళికలు వివరించారు. సుగంధ ద్రవ్యాల డిప్యూటీ డైరెక్టర్ సుందరేషన్, సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ రాజమాణిక్యం మౌనిక, వ్యవసాయ శాఖ ఏఈవో సుజిత, సామల భీమారెడ్డి, వైస్ చైర్మన్ ఏలూరి రాజారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఏలేటి చిన్నారెడ్డి, రైతులు ఏలూరి శ్రీధర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, రాజారపు రాజేశ్వర్ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భైంసా, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రణాళిక బద్ధమైన విధానాల ద్వారా ఉపాధ్యాయులు ఎ దుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బాధ్య తాయుతంగా కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. సోమ వారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో అనసూయపవార్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ కృతజ్ఞత సభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉ పాధ్యాయులు సంఘాలకు అతీతంగా జాతీయ వాదానికి ఓటు వేసిన నేపథ్యంలో బీజేపీ అభ్య ర్థి మల్క కొమురయ్య విజయం సాధించినట్లు గా వెల్లడించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, అధ్యాపకుల సంఘాల ప్రతినిధులకు అనసూ యపవార్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా సన్మా నించారు. ఇందులో భైంసా ఏఎంసీ మాజీ చైర్మె న్ జాదవ్ రాజేష్ బాబు, బీజేపీ భైంసా మండ ల అధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డి, ప్రతినిధి సాంప్లీ రమేష్, లోకేశ్వరం మండల విద్యాధికా రి చంద్రకాంత్ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం కేజీబీవీలో బాలశక్తి ప్రోగ్రాం

లోకేశ్వరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బాలశక్తి ప్రోగ్రాంలో భాగంగా ఆర్థికఅక్షరాస్యత, మనీ మేనేజ్‌మెంట్, ఆర్థిక విషయాలపై అక్షరాస్యత కేంద్రం సభ్యులందరూ కలిసి బ్యాంకులతో ఆర్థికలాభాలు, బ్యాంక్ అందిస్తున్న సేవల గురించి, అకౌం ట్ విషయాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అశోక్, ఆర్థిక అక్షరాస్యత సిబ్బంది వినయ్, మల్లేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా విస్తృత ప్రచారం

● నిర్మల్ సర్కిల్ ఎస్ఈ సుదర్శనం

నిర్మల్ కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ సర్కిల్ పరిధిలో జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా విస్తృత ప్రచారం చేస్తున్నామని నిర్మల్ సర్కిల్ ఎస్ఈ బి.సుదర్శనం తెలిపారు. సోమ వారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో టెక్ని కల్ అధికారులు, సేఫ్టీ అధికారులను నియమించి వినియోగదారులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. రైతు లు, వినియోగదారులు ఎట్టి పరిస్థితుల్లో సంస్థ చేయాల్సిన విద్యుత్ పనులను సొంతంగా చేయ వద్దని సూచించారు. వినియోగదారుల ఇళ్లల్లో నాణ్యమైన వైరింగ్ లేకపోవడంతో, నాసిరకం విద్యుత్‌పరికరాల వినియోగంతో ప్రమాదాలు సంభవిస్తుంటాయన్నారు. రైతులు స్విచ్‌బోర్డు, మోటార్‌స్టార్టర్‌ల వద్ద భద్రత ప్రమాణాలు పాటించకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. నాణ్యమైన విద్యుత్ సామాగ్రి వినియోగించుకోవాలన్నారు. రైతులు, వినియో గదారులు సొంతంగా పనులు చేసుకోవడంతో ప్రమాదాలు జరిగి నిండు ప్రాణా లు కోల్పోతున్నారని తెలిపారు. విద్యుత్ కంచెలు ఏర్పాటుతో ప్రమాదాలు జరు గుతున్నాయన్నారు.

పొన్కల్ ఆలయంలో డీసీసీ అధ్యక్షుడి పూజలు

మామడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్కల్ శ్రీ లక్ష్మీ వెం కటేశ్వర ఆలయంలో రాజగోపురం, సుదర్శన చక్రం ప్రతిష్టాపన కార్యక్రమానికి నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు హాజరయ్యారు. ఈ సంద ర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతష్టాపన కార్యక్రమానికి రూ. లక్ష ఒక వెయ్యి విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో హరీష్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, లింగన్న, శేఖర్, వికాస్, బాపయ్య, భూమేశ్వర్, గంగారెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌కల్చరల్ : సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు అన్నారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 15 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. శ్రీహరిరావు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలబడి పాలన అందిస్తోందన్నారు. సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్‌హాదీ, నాయకులు భుజంగ శ్రీనివాస్ రెడ్డి, ఓడ్నాల రాజేశ్వర్, బి. నర్స య్య భూరాజ్, కే.శ్రీనివాస్, ఈటెల శ్రీనివాస్, గాజుల రవి, నల్లూరి పోశెట్టి, అయ్యన్నగారి పోశెట్టి, సభా కలీమ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



బ్రహ్మంగారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తలమడుగు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తలమడుగు ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం పల్లి కే గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఘనంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన, పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మల కల్యాణం కన్నుల పండగ నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా హాజరైన సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని అలవర్చుకోవాలని కోరారు. అనంతరం నందిగామ గ్రామంలో నూతనంగా నిర్మించిన నంది శివాలయాన్ని దర్శించుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మౌనిశ్ రెడ్డి వారివెంట గ్రామస్థులు రమేష్ రెడ్డి, దామోదర్ రెడ్డి, కె.దలేశ్వర్ రెడ్డి, లింగా రెడ్డి, పాండు, లక్ష్మణ్ భూ మారెడ్డి, రామచందర్ రెడ్డి, చినస్వామి తదితరులు ఉన్నారు.

తాంసిలో విషజ్వరాలు

తాంసి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యాధుల తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. వాతావరణ పరిస్థితుల ప్రభావమో లేక తాగునీటి కలుషితమో తెలియదు గాని మండలంలోని చాలా గ్రామాల్లో రోగులు మంచం పట్టారు. దినం పూట ఎండ, చీకటి పడిందంటే చలి ఉండటంవల్ల జనం వ్యాధుల బారిన పడుతున్నారేమోనని పలువురు పేర్కొంటున్నారు. గ్రామాల్లో దోమల మందు స్ప్రే చేయకపోవడం, చెత్తా చెదారం పేరుకు పోయి ఉండటంతో కూడా దోమల తీవ్రత ఎక్కువై రోగాలు వ్యాపిస్తున్నాయని అంటున్నారు. ముఖ్యంగా కీళ్ల, కాళ్ల నొప్పులతో పాటు వాంతులు విరోచనాలు చేసుకుంటున్నారు. ఇటీవల గిరిగావ్ గ్రామంలో ఒకరు డెంగీతో మంచం పట్టారు. చాలా మంది గొంతు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. నొప్పి అధికం కావడంతో స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీల వద్ద సామాన్య జనం చికిత్సలు చేయించుకుంటున్నారు. మండల కేంద్రంలో ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ వంటి పూట మాత్రమే పనిచేస్తుండటంతో రోగులు పూర్తి స్థా యిలో వైద్యాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. వెంటనే ఆయా గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏ ర్పాటు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

● ఆర్‌ఎంపీలకు పెరిగిన గిరాకీ

గత కొద్దిరోజుల నుంచి వ్యాధుల తీవ్రత ఎక్కువ కావడంతో ఆర్‌ఎంపీ వైద్యులకు గిరాకీ పెరిగింది. తాంసి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కప్పర్ల, గిరిగావ్, బండల నాగపూర్, పొన్నారి, గ్రామాలలో ఉప కేంద్రాలు ఉన్నప్పటికీ వైద్య సేవలు సకాలంలో అందకపోవడంతో చాలామంది రోగులు ఆర్‌ఎంపీ వైద్యాన్ని చేయించుకుంటున్నారు. కొంతమంది స్థానికంగా వైద్యం చేయించుకుంటుండగా మరికొందరు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

నిరుపేద పెళ్లికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ఆదివాసీ ఆడబిడ్డలు

నేరడిగొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగల్‌మోట.తర్నం (బి) గ్రామానికి చెందిన ఆడపడచులు పేదింటి అమ్మాయి పెళ్లికి ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు. ఆదివాసుల సాంస్కృతిక సాంప్రదాయాలతో ఆది వాసీ గ్రామాల్లో నూతనంగా పెళ్లి చేసుకునే వధూవరులకు ఎలాంటి కట్న కానుకలు లేనందున గ్రామంలోని 62 కుటుంబాల ఆడపడుచులు అందరూ కలిసి వారికి తోచినంత పొదుపు చేసుకుని రూ. 15555 ఆర్థిక సహాయాన్ని అందజేసి గ్రామస్తులు వారి ఐక్యమత్యాన్ని చాటుకున్నారు. ఈనెల మూడవ తేదీన సైతం పేదింటి ఆడబిడ్డకు రూ. 12,342 అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కుంరం భీంరావు పటేల్, పేందూర్ మారుతి, దేవారి, సిడం శ్యామ్‌రావు మహాజన్, కుంరం గంగారాం, ఆత్రం ఈశ్వ ర్, ఉప సర్పంచ్ తోడసం మన్కు సిడం గంగారాం, కుంరం అమృత్‌రావు, కుంరం తుల్సిరం పెందూర్, బాపూరావు, మెస్రం లింగు కుంరం, రామారావు, యూ త్ సభ్యులు మడవి తుకారం జుగ్నాక్, నందేవ్ మెస్రం ప్రవీణ్, తొడసం రవి, పెందూర్ సుంగు, కుంరం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. అన్నదాత!

- తాంసిలో అడుగంటిన భూగర్భ జలాలు
- ఎండిపోతున్న పంటలు..
- నీటి తడి కోసం రైతన్నల విశ్వ ప్రయత్నం
- బోర్లు వేయిస్తున్నా రాని చుక్క నీరు



ఎడారిని తలపిస్తున్న తాంసి వాగు



నీటి తడి లేక ఎండుతున్న జొన్న పంట




నీరు లేక ఎండిపోయిన కూరగాయల పంటలు

తాంసి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు కష్టంతో పాటు నష్టాలూ ప్రారంభమయ్యాయి. ఇంకా వేసవికాలం ప్రారంభం కాకముందే తాంసిలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. దీంతో తమ పంటలను కాపాడుకునేందుకు కోసం రైతులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందంగా తయారైంది. ఖరీఫ్ ఎలాగో ఆదుకో లేకపోయినప్పటికీ రబీ సాగుతోనైనా తమ కష్టాలు తీరు స్తాయని గంపెడాశతో ముందడుగు వేశారు. కానీ భూగర్భ జలాలు అప్పుడే అడుగంటి పోయాయి. దీంతో పంటలకు నీళ్లు పెట్టలేక కళ్లముందే పంటలు ఎండిపోతున్న దృశ్యాన్ని చూసి రైతులు తల్లడిల్లుతున్నారు. వాస్తవానికి ప్రతి సంవత్సరం ఏప్రిల్ మే నెలలో కొంత నీటి కొరత ఏర్పడేది. కానీ ఈ సంవత్సరం జనవరి చివరి నుం చి ప్రారంభమయ్యాయి. దీంతో రబీ సాగు చేస్తున్న రైతు లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంట చేతికి వచ్చే అవకాశాలు లేకపోవడంతో అప్పులు మరింత ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కంటే ఈ సంవత్సరం రబీ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. చెరువులు, వాగులు, కుంటల్లో సైతం చుక్క నీరు లేక ఎడారులను తలపిస్తున్నాయి. 8,500 ఎకరాలకు సాగునీరు అందించే మత్తడి వాగు ప్రాజెక్టు సైతం పూర్తి గా ఎండిపోవడానికి వచ్చింది. దీంతో రబీ పంటలు చేతికి వచ్చుడు కష్టమేనని అంటున్నారు.

● గణనీయంగా పెరిగిన రబీ సాగు..

గతంలో పోలిస్తే ఈ సంవత్సరం రబీ సాగు జిల్లా వ్యాప్తంగా గణనీయంగా పెరిగిది. సుమారు లక్ష ఎకరాలలో జొన్న పంట 20 వేల ఎకరాలలో వేరుశనగ, పది వేల ఎకరాలలో కూరగాయాలు, పెసరి, మినుము పంటలను సాగు చేస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడు రబీ సాగు విస్తీర్ణం పెరగడం అప్పుడే భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలు చేతికి వచ్చేలా కనిపించడం లేవు. దీంతో రైతులు చేసిన అప్పులు రెట్టింపులు కాక తప్పదనడంలో ఎలాంటి సందేహం లేదనే చెప్పవచ్చు.



పూర్తిగా ఎండిపోతున్న మత్తడి వాగు ప్రాజెక్టు

● బోర్లు వేయిస్తున్నా ఫలితం శూన్యం

పంటలను ఎలాగైనా కాపాడుకోవాలన్న తపనతో సాగు నీటి కోసం విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా కొత్త బోర్లు వేయిస్తున్నప్పటికీ చుక్క నీరు పడటం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద రబీ సాగు గగనమేనని అంటున్నారు.



పని చేయని చేతి పంపు

● రానున్న రోజులు ఎలా ఉంటాయో..!?

ఇంకా వేసవి ప్రారంభం కాకముందే పరిస్థితులు ఇలా ఉంటే రానున్న మూడు నెలలు ఎలా ఉంటాయని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. సాగునీటితో పాటు తాగునీటి కొరత కూడా అప్పుడే ప్రారంభమైంది. ముఖ్యంగా గిరిజన తండాల్లో చేతి పంపులు పని చేయడం లేవు. మిషన్ భగీరథ నీరు సకాలంలో రావడం లేదని అంటున్నారు. దీంతో ఏప్రిల్, మే నెలలో తమ పరిస్థితి ఏమిటని అప్పుడే ప్రశ్నించుకుంటున్నారు. తాగునీటి విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతుందో వేచి చూడాల్సిందే..!

● లక్షల్లో నష్టం..



ఎన్నో ఆశలు పెట్టుకుని 12 ఎకరాలలో జొన్న పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జొన్న పంట నెల రోజుల్లో చేతికి వచ్చేది. కాని బోర్లలో నీళ్లన్నీ అడుగండటంతో తడి ఇవ్వలేక పంట ఎండిపోతుంది. ఇప్పటివరకు ఎకరానికి 20 నుంచి 25 వేలు ఖర్చు చేశాను. కాని కళ్ల ముందే పంట ఎండిపోతుండటం తమను తీవ్ర ఆవేదనకు గురి చేస్తుంది. దీంతో కనీసం క్వింటాల్‌కు కూడా జొన్నలు పండే అవకాశాలు కనిపించడం లేదు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలి.

\- ఎల్మ గంగారెడ్డి, రైతు, తాంసి

● నీటి తడి లేకుంటే దిగుబడులు కష్టమే..



ప్రస్తుతం పంటలకు తప్పనిసరిగా నీటి తడి అవసరం. నీటి తడి కనుక లేకుంటే దిగుబడులు కష్టమే. పంటల దిగుబడులు చాలా వరకు తగ్గుతాయి. వాస్తవానికి గతం లో కంటే ఈ ఏడు ముందుగానే భూగర్భ జలాలు అడుగంటాయి. మొదటి నుంచి ఆరుతడి పంటలు వేయాలని చాలా మంది రైతులకు చెప్పడం జరిగింది. ప్రస్తుతం పంట మరో నెల రోజుల్లో చేతికి వచ్చేది. కాని ప్రస్తుతం పరిస్థితులు చూస్తే పంటలు చేతికి రావడం కష్టమే.

\- రవీందర్, వ్యవసాయ శాఖ అధికారి

బోరు బావులు ఎండిపోవడంతో బోరుమంటున్న రైతన్న

● 20 రోజుల్లో చేతికి వచ్చే జొన్న పంట పశువులకు గ్రాసం

బోథ్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏడాది బోరు బావుల్లో భూగర్భ నీటి వనరులు అకస్మాత్తుగా తగ్గిపోవడంతో రైతుల బోరు బావులు ఎండిపోవడంతో రైతన్న బోరుమంటున్నాడు. వర్షాకాలం భారీ వర్షాలతో పంట నష్టపోతే ప్రభుత్వం పరిహారం ఇస్తుందని వేసవికాలంలో తాము వేసిన పంటలకు నీరు అందకపోతే తమను ఆదుకునేది ఎవరంటూ రైతులు వాపోతున్నారు.

● భూగర్భ జలాలు అడుగంటడంతో నష్టపోయా

తాను రూ.60 వేల రూపాయలు పెట్టి ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నానని అయితే అనుకోని రీతిలో భూగర్భ జలాలు అడుగంటడంతో తాను వేసిన నాలుగు ఎకరాల జొన్న పంట చేతికి అందకుండా పోయిందని పొచ్చెర గ్రామానికి చెందిన రైతు వేలేటి ప్రశాంత్ వాపోయారు. నీరు ఉంటుందన్న భరోసాతో 70 వేల రూపాయలతో పైపులు కొనుగోలు చేసి తన సొంత చేనులో నుంచి బోరుబావి ద్వారా ద్వారా కౌలుకు తీసుకున్న భూమిలో జొన్న పంట వేసి సాగు చేసుకుంటున్నామన్నారు. అయితే భూగర్భ జలం ఇంకిపోవడంతో తాను తిరిగి అప్పుల పాలు కావాల్సి వస్తుందని వాపోయారు.

● పశువులకు మేత...

మరో 15 రోజుల్లో జొన్న పంట చేతికొస్తుంది అనుకున్న సమయంలో నీరందక ఎండిపోతున్నదని చేసేదేంలేక తమ పశువులను జొన్న పంటలోనే మేపుకుంటున్నామన్నారు. ఇప్పుడే కాలం ఇలా ఉంటే ముందు ముందు ఎలా ఉంటుందో ఆందోళన వ్యక్తపరిచారు. కనీసం పశువులకైనా తాగునీరు లభిస్తుందో లేదోనని ఆవేదన వ్యక్తపరిచారు. ప్రభుత్వం రైతన్న ఆదుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.





బోర్ బావి ఎండిపోవడంతో పశువు జొన్న చేనులో పశువులను మేపుతున్న రైతు, ఇన్‌సెట్‌లో రైతు ప్రశాంత్

● ఖరీఫ్ పంట పంట పెట్టుబడులకు సరిపోతే రబీ పంట ఆదుకుంటుందనుకున్నా..

ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని కోర్చుకొని ప్రకృతిని ఎదిరించి పంటలు సాగు చేసుకుంటున్నామని, అయితే ఖరీఫ్ పంట చేసిన అప్పులకు సరిపోతుందని రబీ పంట తమను ఆదుకుంటుందనుకున్నామన్నారు. అయితే భూగర్భ నీటి శోకం తమ జీవితాలతో ఆడుకుంటుందని వాపోయారు. తనలాగా ఎంతో మంది రైతులు ఈ ఏడాది సరైన దిగుబడి రాక బోరు బావులు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారన్నారు.

\- శ్రావణ్, రైతు

భావితరాలకు భక్తి భావన అలవర్చండి: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్

బోథ్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భావితరాల వారికి భక్తి భావన కలిగే విధంగా తల్లి దండ్రులు చూడాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కోరారు. సోమవారం మండలంలోని కౌటా(బి) గ్రామంలో జరిగిన శబరిమాత ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో శబరి మాత ఆశ్రమాలు దినదినం అభివృద్ధి చెందడంతో పాటు భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తున్నారన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భక్తి మార్గాన్ని అలవర్చుకుంటున్న భక్తులు భావితరాల వారికి ఇదే విధమైన అలవాటు నేర్పాలన్నారు. పదేళ్ల క్రితమే కౌటాబి గ్రామంలో ఉన్న ఆలయాన్ని తాను సందర్శించానన్నారు. అయితే ఆలయ భక్తులు కమిటీ వారు భక్తిశ్రద్ధలతో చేపట్టి కార్యక్రమం వల్ల జిల్లాలోని కౌటా (బి) ఆశ్రమం పేరు నిలుపుకోవడం సంతో షంగా ఉంద న్నారు. మహిళా భక్తులు తమ తమ పిల్లలను సన్మార్గంలో నడిపించే విధంగా చూడాలని కోరారు. ఆశ్రమ భక్తుల సౌకర్యార్థం తాను వంటశాలను నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తానన్నారు.

● భక్తులతో కలిసి నృత్యం చేసిన ఎమ్మెల్యే

శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవ చివరి రోజున స్థానిక శాసనసభ్యులు హాజరై ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. భక్తులు ఆయన సాదరంగా ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. అనంతరం శ్రీకాంత్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే భక్తులతో కలిసి నృత్యాలు చేశారు. ఎమ్మెల్యే ముత్యం చేయడంతో భక్తులు సైతం పాల్గొని నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, సజన్‌తో పాటు మాజీ సర్పంచులు సి.సదానందం, సురేందర్ యాదవ్, కౌట(బి) గ్రామానికి చెందిన డాక్టర్ స్వామి, వెండి సోమేశ్వర్ పాల్గొనగా ఆశ్రమ కమిటీ సభ్యులు ఎడమల ధర్మారెడ్డి, బద్దం ప్రభాకర్ రెడ్డి, మెరుగు జగదీశ్వర్ రెడ్డి, అన్నదాత కళ్లెం గిరిధర్ రెడ్డితో పాటు గ్రామ పెద్దలు అప్పల రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా బ్రహ్మోత్సవాలు

● భక్తి శ్రద్ధలతో లక్ష్మీ నారాయణ హవనం ● నేడు కల్యాణోత్సవ వేడుకలు

భైంసా, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పద్మా వతి కాలనీలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. శనివారం నుంచి ప్రారంభమైన వేడుకలు భక్తజన సందోహంతో కోలాహలంగా జరుగుతున్నాయి. నిత్యం నిర్వహించే వేడుకల ప్రత్యేక పూజ కార్యక్రమాలకు భక్తుల అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. వేడుకలలో భాగంగా సోమవారం ఉదయం వేళలో యాగశాలలో శాంతిపాఠం. మూలమంత్ర హవనం, లక్ష్మీ నారాయణ హవనం, నిత్య పూర్ణాహుతి. నివేదనలు, బలిహరణం నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రాంగణంలో శోభయాత్ర చేపట్టారు. సాయంత్రం వేళలో శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం, నిత్యహవనం, నిత్య పూర్ణహుతి జరిపారు



లక్ష్మీ నారాయణ హవనం నిర్వహిస్తున్న వేద పండితులు



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుధన్వాచార్య స్వామి

● నేడు కల్యాణ మహోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి - శ్రీదేవి, భూదేవిలతో కల్యాణ మహోత్సవం జరగనుంది. వేలాది మంది భక్తులు కల్యాణోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు తరలిరానున్న నేపథ్యంలో ఆలయ నిర్వాహక కమిటీ, శ్రీ మహాలక్ష్మీ జ్యువెల్లరీ మార్కెట్ కమిటీ ప్రతినిధులు ప్రణాళికబద్ధమైన ఏర్పాట్లు చేపట్టారు ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా ఉండేందుకు గాను చర్యలు చేపట్టారు.

పంట రక్షణకు వినూత్న ఆలోచన

● పుచ్చకాయ పంట చుట్టూ నూనె రాసిన కాగితాల ఏర్పాటు





ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతన్న దాన్ని కాపాడుకునేందుకు నిత్యం నూతన మార్గాలను అన్వేషిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం దేవాపూర్ గ్రామంలో సంతోష్ అనే రైతు తనకున్న రెండెకరాల్లో పుచ్చకాయ పంటను సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో నల్ల, తెల్ల దో మల నుంచి పంటను రక్షించుకునేందుకు భారీగా కాగితాలు ఏర్పాటు చేశారు. నూనె రాసి ఉండే ఈ కాగితాలు దోమలను ఆకర్షించి.. ఆ పేపర్లకు అతుక్కునేలా చేస్తాయి. వీటి ద్వారా పంట నష్టం జరగకుండా ఉంటుందని సదరు రైతు చెబుతున్నారు. ● (ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)

ఫొటో న్యూస్

ఆదిలాబాద్ జిల్లా దేవాపూర్‌లో నల్ల, తెల్ల దోమల నుంచి పంటను రక్షించుకునేందుకు కాగితాలు ఏర్పాటు చేసిన రైతు







నూతన ఎస్పీగా ఉద్యోగ బాధ్యతలను చేపడుతున్న అఖిల్ మహాజన్



● గుడిహత్నూర్‌లో ఆపి ఉంచిన ఐచర్‌ను ఢీకొట్టి బోల్తా పడిన లారీ



● జందాపూర్ గ్రామ సమీపంలో నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

ప్రమాదాలకు.. అడ్డా!

- జిల్లాలో 44వ నెం. జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు
- ఇటీవల జరిగిన ప్రమాదంలో ముగ్గురి మృతి
- జాతీయ రహదారిపై నిర్లక్ష్యంగా వాహనాల పార్కింగ్
- అయినా పత్తాలేకుండా పోతున్న హైవే పెట్రోలింగ్
- జరిమానాలు విధిస్తూ వదిలేస్తున్న పోలీసులు

ఆదిలాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా మీదుగా వెళ్తున్న 44వ జాతీయ రహదారి ప్రమాదాలకు అడ్డాగా మారింది. నిత్యం ఎక్కడో చోట ప్రమాదాలు చోటు చేసుకోవడంతో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. జిల్లాలో నేరడిగొండ మండలంలోని ఆరెపల్లి నుంచి జైనథ్ మండలం డొల్లార వరకు సుమారుగా 85కి.మీ.ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. రహదారిని ఆనుకుని ఉన్న నేరడిగొండ, ఇచ్చోడ, గుడిహత్నూర్, మావల, ఆదిలాబాద్‌రూరల్, జైనథ్ మండలాల పరిధిలోనే ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తరుచు జరుగుతున్న ప్రమాదాలతో ఎందరో మంది మరణించగా శాశ్వతంగా వికలాంగులై కొందరు మంచానికే పరిమితమవుతూ నరకయాతన పడుతున్నారు. తాజాగా గుడిహత్నూర్ మండలంలో రోడ్డుపై నిలిపి ఉంచిన ఐచర్‌ను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే ట్రాఫిక్‌కు గంటల తరబడి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సంఘటన జరిగిన కొన్ని గంటల్లోపే ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్ ఎక్స్ రోడ్డు సమీపంలో రహదారిపై నిలిపి ఉంచిన లారీని ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో డ్రైవర్‌తో సహా అదనపు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఇలాంటి ప్రమాదాలతో ఎన్నో కుటుంబాలు దిక్కుతోచనిస్థితిలో పడిపోతున్నాయి. కుటుంబ పెద్దను కోల్పోవడంతో బాధిత కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యానికి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. అయితే నేషనల్ హైవే అథారిటీ అధికారుల నిండు నిర్లక్ష్యం కారణంగానే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. పోలీసులు అడపదడపా తనిఖీలు చేస్తున్నా.. పూర్తిస్థాయిలో ప్రమాదాలకు అడ్డుకట్ట వేయలేక పోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. రోడ్డు ప్రమాదాల విషయమై నేషనల్ హైవే పీడీని ఫోన్‌లో వివరణ కోరగా స్పందించ లేదు.

నేషనల్ హైవే పై డెత్ స్పాట్స్

అడ్డగోలుగా పార్కింగ్

జాతీయ రహదారిపై వాహనదారులు అడ్డగోలుగా పార్కింగ్ చేయడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన రెండు ఘోర ప్రమాదాలు రాంగ్ పార్కింగ్ కారణంగానే జరిగినట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలో కేవలం ఐదు చోట్లనే వాహనాల పార్కింగ్‌కు నేషనల్ హైవే అథారిటీ అనుమతించింది. కానీ అడుగడుగునా రహదారిపై వాహనాలు నిలపడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నేరడిగొండ మండలం కోర్టికల్, మండలకేంద్రం సమీపంలోని దాబా హోటళ్ల వద్ద, అలాగే ఇచ్చోడ మండలం పెట్రోల్ బంక్ ముందు, గుడిహత్నూర్ మండలం సీతాగొంది పెట్రోల్ బంక్ పక్కన, జైనథ్ మండలం రిలయన్స్ పెట్రోల్‌బంక్ ముందు మాత్రమే వాహనాల పార్కింగ్‌కు స్థలాలను కేటాయించారు. కానీ రహదారి వెంట ఉన్న దాబాల ముందు విచ్చలవిడిగా నడిరోడ్డు పైనే వాహనాలను నిలుపుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మరమ్మతులు వచ్చినా.. ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకుండానే భారీ వాహనాలను రోడ్డుపై నిలుపుతూ వదిలేయడంతో పలు

(తరువాయి 6వ పేజీలో...)



ఇది నిర్లక్ష్యం కాదా?!

పక్కనే ఫొటోలో కనిపిస్తున్నది.. గుడిహత్నూర్ మండలంలోని డోంగ్రాగావ్ గ్రామ సమీపంలో గల జాతీయ రహదారిపై నిర్లక్ష్యంగా నిలిపి ఉంచిన భారీ వాహనం. అయితే ఈ వాహనానికి మరమ్మతులు రావడంతో ఆదివారం రాత్రి నుంచి రోడ్డు పైనే అడ్డంగా నిలిపి ఉంచారు. అయినా హైవే పెట్రోలింగ్ సిబ్బంది, అధికారులు దీనిని పక్కకు తొలగించేందుకు ఎలాంటి ప్రయత్నం చేయక పోవడం గమనార్హం. ప్రమాదం పొంచి ఉందని తెలిసినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయి.

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేకదృష్టి

● జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేకదృష్టిని సారిస్తామని జిల్లా నూతన ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీగా ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. మొదట పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించి బదిలీపై వెళ్తున్న ప్రస్తుత కరీంనగర్ సీపీ గౌస్‌ఆలం నుంచి జిల్లా ఎస్పీగా బాధ్యతలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్నందున ప్రత్యేకదృష్టిని సారించి ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా కట్టడి చేస్తామన్నారు. అలాగే క్రిమినల్ యాక్టివిటిస్ లేకుండా నేరాలను నియంత్రించడం, శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా పని చేస్తామన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల పై ప్రత్యేక దృష్టిని సారించి అడ్డుకట్ట వేస్తామన్నారు. రౌడీలు, గ్యాంగ్‌స్టార్లు లేకుండా హిస్టరీ షీట్లను ఏర్పాటు చేసి ప్రతీరోజు వారి కదలికలను పరిశీలిస్తామన్నారు. ముఖ్యంగా పట్టణంలోని ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ప్రజలు, పోలీసులు అందరు కలిసి కట్టుగా ఆదిలాబాద్ జిల్లాను ఉన్నత స్థాయిలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. పోలీసులను ప్రజలకు మరింత దగ్గర చేసే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. ఇందులో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారాం శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, సీహెచ్ నాగేందర్, హాసిబుల్లా, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది, తదితరులున్నారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

'ప్రజావాణి'కి 90 దరఖాస్తులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 90 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

● కలెక్టరేట్‌లో మొక్కలు నాటిన కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక నివారణ పరిష్కార చట్టంపై సోమవారం కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కలెక్టర్ రాజర్షిషా, డీఎల్ఎస్ఏ సౌజన్య పాల్గొని మాట్లాడారు. అంతకుముందు బేటీ బచావో బేటీ పడావో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైన్ కలెక్టర్ అభిగ్యాన్ పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ అన్నిరంగాల్లో రాణించాలని డీఈవో ప్రణీత పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో అలిమ్‌కో క్యాంప్ నిర్వహించారు. భారతీయ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ, సమగ్ర శిక్షా తెలంగాణ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సోమయ్య, సెక్టోరియల్ ఆఫీసర్ సుజాత్ ఖాన్, డైట్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, భవిత కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో బహుళ ప్రయోజనాలు

● ఐటీడీఏ ఏపీవో పీవీటీజీ మేస్రం మనోహర్

ఉట్నూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్య ఉద్యోగ అవకాశాలే కాకుండా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఐటీడీఏ ఏపీవో పీవీటీజీ మేస్రం మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాలల్లో ఐదవ తరగతిలో ప్రవేశం కోసం ఆరవ తరగతిలో మిగిలిన సీట్ల ప్రవేశం కోసం ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆటల పట్ల అవగాహన కలిగి తమ పిల్లలు ఏ ఆట పట్ల ఆసక్తి పెంచుకుంటున్నారో ఆడుకునేలా అవకాశం కల్పించాలన్నారు. అనంతరం ఎంపిక పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల క్రీడల అధికారులు కోరెడ్డి పార్థసారథి, మీనారెడ్డి, బండ జీవరత్నం, ఏటీడీవో క్రాంతికుమార్, హెచ్ఎం జాదవ్‌ఉత్తం, ఫిజికల్ డైరెక్టర్ జాదవ్ హేమంత్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలి

తలమడుగు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అందించిన కొత్త మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఐటీడీఏ ఏటీడబ్ల్యూవో అనిల్ కుమార్ కోరారు. సోమవారం మండలంలోని ఝరి పూనగూడ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షల సమయం సమీపిస్తున్నందున విద్యార్థు సమయాన్ని వృధా చేయకుండా కష్టపడి చదివి ప్రతీ విద్యార్థి టెన్త్‌లో ఉత్తమ జీపీ సాధించాలని సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలలో మెనూ పాటించకుంటే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాల రిజిస్టర్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఉట్నూర్‌లో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట పొలాల్లో రసాయనిక ఎరువులు వాడకాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వెడ్మ ఫౌండేషన్ ప్రధాన కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయిపూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిస్సాహాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు సేవ చేయాలన్న తపనతో వెడ్మ ఫౌండేషన్‌ను స్థాపించడం జరిగిందన్నారు. ఇప్పటికే అనేక మంది పేదలకు ఆర్థిక చేయూతను అందించామని, భవిష్యత్తులో మరింత సేవ చేయడానికి తమ సంస్థ ఎల్లప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలోని విద్యార్థులకు, రైతులకు అన్ని విధాలుగా అండగా నిలవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అలాగే, సావిత్రిబాయిపూలే జీవితం అందరికీ ఆదర్శం కావాలన్నారు. స్త్రీల విద్యాభివృద్ధికి వారు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. అనంతరం 14 మంది డిగ్రీ కళాశాల విద్యార్థులకు పీజీ ప్రిపరేషన్ కోసం పుస్తకాలను అందజేశారు. నిరుపేదలకు దుప్పట్లతో పాటు రైతులకు మొక్కలను అందజేశారు. ఇందులో డాక్టర్ జాదవ్‌కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని భీంనగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మారుతి కుమారుడు వినోద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కాగా, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే, ముత్నూర్‌లో కాంగ్రెస్ నాయకుడు రుతిక్ అమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గిరిజన సమస్యలు త్వరగా పరిష్కరించాలి

● గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా

ఉట్నూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గిరిజనప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. పింఛన్, రెండు పడకల గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇందులో ఏపీవో పీవీటీజీ మేస్రం మనోహర్, ఈఈ జాదవ్‌తానాజీ, ఏవో దామోదర్‌స్వామి, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● అన్ని రంగాల్లో మహిళల పాత్ర కీలకమైనది

ఉట్నూర్: కుటుంబాన్ని తీర్చిదిద్దడం నుంచి దేశాన్ని పాలించే వరకు మహిళల పాత్ర కీలకమైనదని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా పేర్కొన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ మహిళ ఉద్యోగులకు ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు సామాజికంగా ఎంతో తోడ్పాటు అందిస్తున్నారని, దేశ ప్రథమ పౌరురాలి స్థానంతో పాటు ముఖ్యమంత్రులు, మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ , ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, శాస్త్రవేత్తలుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఐటీడీఏ కార్యాలయానికి సేవలందించిన మహిళా ఉద్యోగులకు లంచ్‌బాక్సులను అందజేశారు. ఇందులో పలువురు మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

● రెగ్యులర్ డీడీని నియమించాలని వినతి

ఉట్నూర్: ఉట్నూర్ ఐటీడీఏలోని జిల్లా గిరిజన సంక్షేమ శాఖకు రెగ్యులర్ డీడీని నియమించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూరు దాదిరావు డిమాండ్ చేశారు. సోమవారం ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తాని కలిసి వినతిపత్రం సమర్పించారు. గత రెండో రోజుల కింద జాదవ్ అంబాజి స్థానిక కార్యాలయంలో ఇన్‌చార్జీ డీడీగా బాధ్యతలు తీసుకోవడం సరికాదన్నారు. ప్రస్తుతానికి ఆయన నిర్మల్, మంచిర్యాలలో కూడా విధులు నిర్వహిస్తున్నారని, ఉట్నూర్ ఐటీడీఏకు కూడా ఇన్‌చార్జీ డీడీగా ఉండి గిరిజన విద్యార్థులకు ఏవిధంగా విద్య పటిష్టమైన విధంగా అందిస్తారన్నారు. మూడు చోట్ల విధులు నిర్వహిస్తే ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఉట్నూర్ ఐటీడీఏ గిరిజన విద్యార్థులు నష్టపోతారని, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రత్యేక దృష్టి సారించి రెగ్యులర్ డీడీని నియమించేలా కృషి చేయాలని కోరారు.

● 'ఇచ్చోడ విద్యార్థిని మృతి పై విచారణ జరిపించాలి'

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఇచ్చోడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని అనుమానాస్పదస్థితిలో మృతి చెందినందున విద్యార్థిని మృతిపై విచారణ జరిపించాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్ ఐటీడీఏ పీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థిని జ్వరంతో బాధపడుతున్న విషయం అక్కడి వార్డెన్, ప్రధానోపాధ్యాయుడికి తెలిపిన స్పందించ లేదని ఆరోపించారు. విద్యార్థిని మృతికి కారణమైన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఉట్నూర్ ఐటీడీఏలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళా ఉద్యోగులతో పీవో ఖుష్బుగుప్తా

● నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఉమ్మడి జిల్లాలోని గిరిజజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులు, దినసరి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని సంఘం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు కేబీసీ నారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారిని కలిసి సమస్యలు వివరించామని తెలిపారు. ఆయన వెంట ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు రామచందర్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు శౌకత్‌హుస్సేన్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాజలింగు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దిలీప్ కుమార్‌తో పాటు తదితరులు ఉన్నారన్నారు.

● విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఇంద్రవెల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఐటీడీవో ఖుష్బూగుప్తా పేర్కొన్నారు. ఇటీవల ఫిబ్రవరి నెలలో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగినటువంటి 11వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో జిల్లా నుంచి ఇంద్రవెల్లిలోని ముత్నూర్ గిరిజన బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. నునావత్ రాణి సెకండ్ ఇయర్ అండర్-16 విభాగంలో డిస్కస్ త్రోలో సిల్వర్ మెడల్, అలాగే పెందోర్ సక్కు డిస్కస్‌త్రో లో బ్రాంజ్ మెడల్, అలాగే హైజంప్‌లో గోల్డ్ మెడల్ సంపాదించారు. ఈ సందర్భంగా పీవో మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్‌లు అందించి ప్రశంసించారు. ఇందులో రీజినల్ కో ఆర్డినేటర్ ఆగస్టిన్, ప్రిన్సిపాల్ సంగీత, పీడీ సౌమ్య శాను బాయిలు, వైస్ ప్రిన్సిపాల్ విజయభార్గవి, డిప్యూటీ వార్డెన్ కృష్ణవేణి, సిబ్బంది ఉన్నారు.



మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ● సిరికొండలో పలు అభివృద్ధి పనులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి శంకుస్థాపనలు

సిరికొండ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. సోమవారం మండలంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా ఇరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలను మండలానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రూ.కోటి 43 లక్షల వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి, రూ. 20 లక్షల నిధులతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి, రూ.12 లక్షల నిధులతో అంగన్వాడీ భవన నిర్మాణం, రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్లకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ పార్టీలకతీతంగా మారుమూల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడారు. ఇందులో పంచా యతీరాజ్ డీఈ రాజేశ్వర్, డీఎల్పీవో ఫణిందర్, ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ తుకారాం, ఐకేపీ ఏపీఎం సంతోష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఒరుగంటి పెంటన్న, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, గత శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీలు ఇచ్చిన హామీలను అమలు పర్చే విధంగా కృషి చేయాలని మండలానికి చెందిన ఆర్ఎంపీలు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ని కోరారు. సోమవారం మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యేను కలిసి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు లక్కం మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ ఆర్ఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను మంజూరు చేసి తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆర్ఎంపీలపై అక్రమ కేసులు పెట్టి తమను కాంగ్రెస్ ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తుందని, వెంటనే ఆర్ఎంపీలపై వేధింపులను ఆపి తమకు గుర్తింపును ఇవ్వాలని కోరారు.



సిరికొండలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న బోథ్, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేలు

● బోథ్ ఎమ్మెల్యేను కలిసిన కోకస్ మన్నూర్ గ్రామస్తులు

నేరడిగొండ: ఇచ్చోడ మండలంలోని కోకస్‌మన్నూర్ గ్రామ ప్రజలు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో సోమవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. త్వరలోనే మీ సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారని వారు పేర్కొన్నారు.